# రసవత్తర రాజకీయం

# లష్కర్‌లో గులాబీ ధూంధాం

- సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం
- ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 1200 కోట్ల అభివృద్ధి పనులు
- క్షేత్రస్థాయిలో ప్రచారం వేగం పెంచిన నాయకులు, కార్యకర్తలు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆకట్టుకుంటున్న బృందాలు



ఇంటింటికీ కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న గులాబీ శ్రేణులు

**సికింద్రాబాద్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మరోసారి గెలుపు దిశగా.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను ప్రధాన అస్త్రాలుగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నాయకులు, కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. ప్రధాన చౌరస్తాలలో ధూంధాంలు కూడా నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.**

**- సిటీబ్యూరో/సికింద్రాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ)**

సికింద్రాబాద్‌లో అడ్డగుట్ట, మెట్టుగూడ, బౌద్ధనగర్, సీతాఫల్‌మండీ, తార్నాక డివిజన్లు ఉన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 12 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. పాఠశాలలు, కాలేజీ, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, దవాఖానలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోవైపు సంక్షేమ పథకాలు కూడా అర్హులందరికీ అందేల చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,56,577 ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే గడప గడపకు వెళ్తున్న నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.

### ప్రతిపక్షాలు డీలా..

సికింద్రాబాద్‌లో అధికార పక్షం దూకుడు ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోతున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పద్మారావు గౌడ్ సీఎం కేసీఆర్‌కు ఆత్మీయుడు. ప్రజలకు పజ్జన్న అంటే గౌరవం పెరిగింది. ఆపదలో అండగా ఉంటాడని ప్రజల్లో పేరుంది. క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ పార్టీకి అనూహ్య స్పందన వస్తోంది. ఇది చూసి కాంగ్రెస్, బీజేపీలు ముందుగానే చేతులెత్తేస్తున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి అభ్యర్థులను బరిలోకి దించడానికి రెండు పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. హై కమాండ్ నుంచి సీటు ఖరారు కాకున్నా కొంతమంది మేమే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులమని ప్రచారంలో దిగడం హాస్యాస్పదంగా ఉందని ప్రజలు వాపోతున్నారు.

## బీఆర్ఎస్‌కు జైకొట్టిన మహిళలు



రత్నానగర్, సత్యానగర్ బస్తీ మహిళలను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 7: నల్లకుంట డివిజన్ రత్నానగర్, సత్యానగర్ బస్తీలకు చెందిన 300 మంది మహిళలు శనివారం సాయంత్రం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయా బస్తీలకు చెందిన అంజమ్మ, రత్నమాల, సరస్వతీ, యాదమ్మ, కౌసల్య తదితరుల ఆధ్వర్యంలో 300 మంది మహిళలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

### మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి



మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు

అమీర్‌పేట్, అక్టోబర్ 7 : సనత్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్శితులై బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌జాదవ్, బస్తీ అధ్యక్షులు హరిసింగ్ జాదవ్ ఆధ్వర్యంలో బస్తీకి చెందిన దాదాపు 50 మంది యువకులు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్, మనోజ్, విశాల్, తరుణ్, సయిన్ రాథోడ్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సాయన్నలాగే సేవ చేస్తా..అవకాశమివ్వండి

### బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత



ఒకటో వార్డులోని పలు కాలనీల పెద్దలతో సమావేశమైన బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 7 : ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని జోడెద్దుల్లా నడిపిస్తున్న సీఎం కేసీఆర్ సర్కారును మరోసారి ఆశీర్వదించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత కోరారు. శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒకటో వార్డులో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో కలిసి పబ్లిక్ సెక్టార్, ఉమా నగర్, సంచారిపురి, వాయునగర్, విఠల్ నగర్‌లో లాస్యనందిత పర్యటించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్నలాగే తాను కూడా ప్రజా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకురాలు నివేదితతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం

### ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా ఎన్నికల వ్యయాన్ని సమీక్షించేందుకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ అకౌంటింగ్ అధికారులను నియమించారు. ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు అధికారులను నియమించారు. వీరిలో జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ జోన్‌లలో పని చేస్తున్న ఆడిట్ సెక్షన్ సూపరింటెండ్‌లను, అడిట్ సెక్షన్ సీనియర్ అధికారులు, జూనియర్ ఆడిటర్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను ఎన్నికల వ్యయ పరిశీలకులుగా జీహెచ్ఎంసీ కమిషనర్ నియమించారు. అదేవిధంగా రిజర్వ్‌గా హెడ్ ఆఫీస్ ఎఫ్.ఎ.సెక్షన్ సూపరింటెండెంట్ యాదమ్మతో పాటు పలువురు అధికారులు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా పనిచేయనున్నారు.

| నియోజకవర్గం | అకౌంటింగ్ ఆఫీసర్లు |
|---|---|
| ముషీరాబాద్ | మీర్జా రాజా అలీ, అజయ్‌కుమార్, |
| మలక్‌పేట | శ్రీనివాస్ గౌడ్, కే.నరేందర్ |
| ఖైరతాబాద్ | రాజు, బాబు |
| అంబర్‌పేట | రాంమోహన్, అనిల్‌కుమార్ |
| జూబ్లీహిల్స్ | రమేశ్, కుమారస్వామి |
| సనత్‌నగర్ | పద్మజ రాణి, భరత్ |
| నాంపల్లి | లెనిన్ బాబు, ఫర్జానా బేగం |
| కార్వాన్ | శ్రీలత, భారతి |
| గోషామహల్ | ముబీన్ ఫాతిమా, వెంకటేశ్ |
| చార్మినార్ | సయ్యద్ జియా ఉల్లా హుస్సేన్, ఎండీ ఖాదిర్ అలీ |
| చాంద్రాయణగుట్ట | ముభాషిర్ హుస్సేన్ ఖాన్, సాగర్ సక్సేన్ |
| యాకుత్‌పుర | రమేశ్ యాదవ్, సుధాకర్ |
| బహదూర్‌పుర | చంద్రమోహన్, బావ్మాతి |
| సికింద్రాబాద్ | సంజన, స్రవంతి |
| కంటోన్మెంట్ | పరమేశ్వరి, సురేష్ |

## ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం విరాళం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నామినేషన్ ఖర్చులకు విరాళం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

వనస్థలిపురం, అక్టోబర్ 7: రానున్న ఎన్నికల్లో తామంతా సుధీర్‌రెడ్డి వెంటే ఉంటామని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. శనివారం హస్తినాపురం సంగీత గ్రాండ్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. దాంతోపాటు ఆయన నామినేషన్ ఖర్చులకు ఒక్కో రూపాయి చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధే ఎజెండాగా తాను పనిచేశానన్నారు. తనకు ఆర్యవైశ్యులతో ఎంతో ఆత్మీయ సంబంధం ఉందన్నారు. తనపై ఆర్యవైశ్య సోదరులు చూపిన ప్రేమకు రుణపడి ఉంటానన్నారు. తీర్మానం చేసిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు కాసుల శ్రీనివాసులు, శివ యాదగిరి, సారపు రవికుమార్, సుధాకర్, ఆంజనేయులు, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడలో నేడు బీఆర్ఎస్ శిక్షణ శిబిరం



జియాగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శిక్షణ శిబిరం వివరాలు తెలియజేస్తున్న కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ, అక్టోబర్ 7 : జియాగూడ డివిజన్ దుర్గానగర్‌లో భారత అభ్యుదయ పాఠశాలలో కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల నిర్వహణ శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహిస్తామని బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్రకృష్ణ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు శిక్షణ శిబిరం 500 మంది కార్యకర్తలతో రెండు శిబిరాలుగా జరుగుతుందన్నారు. ఏ బ్లాక్‌కు ప్రొఫెసర్ జయశంకర్ శిక్షణ శిబిరం, బీ – బ్లాక్‌కు శ్రీకాంతాచారి శిక్షణ శిబిరం పేరున నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నరహరిచారి, సి. బాబు, శ్రీనివాస్‌గుప్త, జడల మోహన్, ఉమేశ్, కేశవ్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.